అక్షర దర్బార్
www.aksharadarbar.com
voice of the people
వెల ₹5
బుధవారం 5, ఫిబ్రవరి 2025 | సంపుటి :02 | సంచిక :308 | పేజీలు :05



“డిజిటల్ మీడియా రంగంలో సంచలనాలకు శ్రీకారంచుట్టిన అక్షరదర్బార్ రేపటితో సంవత్సరం పూర్తి చేసుకొని రెండో వసంతంలోకి అడుగిడుతోంది. నిజాయితీగా, నిష్పక్షపాతంగా వార్తలు అందిస్తూ ప్రజల గొంతుకగా నిలిచింది. ఎన్నో సంచలనాత్మక కథనాలతో అధికార యంత్రాంగాన్ని కదిలించింది. మరెన్నో ప్రయోగాలకు వేదికగా నిలిచిన ఘనతను సాధించింది. అనతి కాలంలోనే మీ అందరి ఆదరాభిమానాలతో విజయ శిఖరంపై నిలిచింది. ఏడాది కాలంగా మాకు వెన్నంటి నిలిచిన, మమ్మల్ని ముందుకు నడిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా అక్షరదర్బార్ కుటుంబ సభ్యుల తరుపున హృదయపూర్వక కృతజ్ఞతలు, మీ ఆదరాభిమానాలు భవిష్యత్‌లోనూ మాపై ఇలానే ఉండాలని ఆకాంక్షిస్తూ..

మీ..
వి.రాజేశ్వర్‌రావు,
సీఎండీ, ఎడిటర్


## బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి

- బీసీ కులగణన ఓ చరిత్ర
- బీసీలకు గత ప్రభుత్వం చేసిందేమీ లేదు
- మీడియాతో మంత్రి కొండా సురేఖ




02

# అసంతృప్తిపై ఫోకస్ !



**దిద్దుబాటు చర్యలకు కాంగ్రెస్ సిద్ధం!**

అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలకు చెక్ పెట్టేందుకు పార్టీ పెద్దలు రంగంలోకి దిగారు. ఇటీవల జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నేతృత్వంలో 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశమయ్యారని వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. ఆరోపణలు ఎదుర్కుంటున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండించగా, మరికొందరు మాత్రం సైలెంట్‌గా ఉండిపోయారు. కొన్ని నియోజకవర్గాలకు మాత్రమే నిధులు అందుతున్నాయని, పలువురు మంత్రుల తీరు ఇబ్బందికరంగా మారిందని కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ తాజా పరిణామాలు కాంగ్రెస్‌లో కాకరేపుతున్నాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు అధిష్టానం దిద్దుబాటు చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రేపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎమ్మెల్యేల రహస్య భేటీ విషయంలో పార్టీలో జరుగుతున్న చర్చ నేపథ్యంలో ఎమ్మెల్యేలతో వ్యక్తిగతంగా కంటే పార్టీపరంగా సమావేశమై జిల్లాలు, నియోజకవర్గాలవారీగా పార్టీ, ప్రభుత్వం పరంగా వారికున్న సమస్యలు చర్చించాలనే అభిప్రాయానికి హస్తం పెద్దలు వచ్చినట్లు తెలుస్తోంది. అదేవిధంగా రాష్ట్రంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరితో సీఎం, పీసీసీ ఛీఫ్ సమావేశం కానుండటం ఇదే తొలిసారి కావడంతో రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

-అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

02

- రేపు పార్టీ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సమావేశం
- హాజరుకానున్న దీపాదాస్ మున్షీ, మహేష్ కుమార్ గౌడ్
- సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు వరంగల్ జిల్లా నేతలతో భేటీ
- పార్టీలోని అంతర్గత విభేదాలు చక్కదిద్దడమే లక్ష్యం
- స్థానిక ఎన్నికలు, పార్టీ నిర్మాణంపైనా చర్చ
- ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్ నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత
- ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టే వ్యూహం

## ఫిబ్రవరి 4 చరిత్రాత్మక దినం



- దేశానికే తెలంగాణ రోల్‌మోడల్
- కాంగ్రెస్‌తోనే సమాజిక న్యాయం సాధ్యం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కుల గణన, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై సంబురాలు
- రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం

03



## గీత దాటొద్దు..

- ఎమ్మెల్యేలు, ఎంపీలైపైనా క్రమశిక్షణ చర్యలు తప్పవు
- రేపటి సమావేశంలో అన్ని మాట్లాడుకుంటాం..
- శాస్త్రీయ పద్ధతిలోనే కుల గణన ..
- బీసీ సంఘాల నేతలు రాజకీయ పార్టీల ట్రాప్‌లో పడొద్దు
- టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

02

## వేటు తప్పదా ?

- తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసులు
- నోటీసులపై ఘాటుగా స్పందించిన ఎమ్మెల్సీ..
- కాంగ్రెస్ పార్టీ మీ అయ్య జాగీరా? అంటూ హెచ్చరిక

03



బుధవారం
05.02.2025
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక



# అసంతృప్తులపై ఫోకస్!

- దిద్దుబాటు చర్యలకు కాంగ్రెస్ సిద్ధం!
- రేపు పార్టీ ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి సమావేశం
- హాజరుకానున్న దీపాదాస్ మున్షీ, మహేష్ కుమార్ గౌడ్
- సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు వరంగల్ జిల్లా నేతలతో భేటీ
- పార్టీలోని అంతర్గత విభేదాలు చక్కదిద్దడమే లక్ష్యం
- స్థానిక ఎన్నికలు, పార్టీ నిర్మాణంపైనా చర్చ
- ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్ నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యత
- ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టే వ్యూహం

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలకు చెక్ పెట్టేందుకు పార్టీ పెద్దలు రంగంలోకి దిగారు. ఇటీవల జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నేతృత్వంలో 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్యంగా సమావేశమయ్యారని వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. ఆరోపణలు ఎదుర్కొంటున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండించగా, మరికొందరు మాత్రం సైలెంట్‌గా ఉండిపోయారు. కొన్ని నియోజకవర్గాలకు మాత్రమే నిధులు అందుతున్నాయని, పలువురు మంత్రుల తీరు ఇబ్బందికరంగా మారిందని కొందరు ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ తాజా పరిణామాలు కాంగ్రెస్‌లో కాకరేపుతున్నాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు అధిష్టానం దిద్దుబాటు చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రేపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎమ్మెల్యేల రహస్య భేటీ విషయంలో పార్టీలో జరుగుతున్న చర్చ నేపథ్యంలో ఎమ్మెల్యేలతో వ్యక్తిగతంగా కంటే పార్టీపరంగా సమావేశమై జిల్లాలు, నియోజకవర్గాలవారీగా పార్టీ, ప్రభుత్వం పరంగా వారికున్న సమస్యలు చర్చించాలనే అభిప్రాయానికి హస్తం పెద్దలు వచ్చినట్లు తెలుస్తోంది. అదేవిధంగా రాష్ట్రంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరితో సీఎం, పీసీసీ చీఫ్ సమావేశం కానుండటం ఇదే తొలిసారి కావడంతో రాజకీయవర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

### ఇదే తొలిసారి..

ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి రేపు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ, టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ హాజరుకానున్నారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈ ముఖాముఖి కొనసాగనున్నట్లు సమాచారం. పార్టీ ఎమ్మెల్యేలను మొత్తం 4 గ్రూపులుగా విడదీసి జిల్లాల వారీగా భేటీ కాబోతున్నట్లు తెలుస్తోంది. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు. రాబోయే సంస్థల ఎన్నికలు, పార్టీ సంస్థాగత నిర్మాణంపై చర్చించనున్నట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నప్పటికీ, ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం, పీసీసీ ఛీఫ్, దీపాదాస్ సమావేశం కానుండటం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లో అంతర్గత పోరు కొనసాగుతుందని, రేవంత్ రెడ్డిపై తిరుగుబాటు మొదలైందని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టడంతోపాటు సొంత పార్టీ ఎమ్మెల్యేల సమస్యలను వినేందుకు హస్తం పెద్దలు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

### స్థానిక ఎన్నికలపై గురి

స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ గురిపెట్టింది. అధికారంలో ఉన్నందున రాష్ట్రంలోని 80కి పైగా శాతం స్థానాలు కైవసం చేసుకొని స్థానికంగా పట్టునిలుపుకోవాలనే లక్ష్యంతో ముందుకుసాగుతోంది. ఈనెల 15లోపు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో ఆదిశగా లీడర్లు, కేడర్‌ను సమాయత్తం చేస్తోంది. ఇప్పటికే పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు వారి నియాజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు పూర్తి చేశారు. మరోపక్క కుల గణన, ఎస్సీ వర్గీకరణ నివేదికను కేబినెట్, అసెంబ్లీలో ఆమోదింపజేశారు. దీంతోపాటు ఏడాది కాంగ్రెస్ పాలనలో గ్యారెంటీలు, ఎన్నికల హామీలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పార్టీకి సానుకూల వాతావరణం ఉన్నందున దీన్ని అనుకూలంగా మల్చుకోవాలని భావిస్తోంది. రేపు ముఖ్యమంత్రి కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ పెద్దల దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.



# గీత దాటొద్దు..!

- ఎమ్మెల్యేలు, ఎంపీలపైనా క్రమశిక్షణ చర్యలు తప్పవు
- రేపటి సమావేశంలో అన్ని మాట్లాడుకుంటాం..
- శాస్త్రీయ పద్ధతిలోనే కుల గణన ..
- బీసీ సంఘాల నేతలు రాజకీయ పార్టీల ట్రాప్‌లో పడొద్దు
- టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

అక్షరదర్బార్, హైదరాబాద్: కుల గణన శాస్త్రీయ పద్ధతిలోనే జరిగిందని టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో 56 శాతానికిపైగా బీసీలు ఉన్నారని ఆయన తెలిపారు. బీసీ సంఘాలను బీఆర్ఎస్ నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బీసీ సంఘాల నేతలు రాజకీయ నాయకుల ట్రాప్‌లో పడవద్దని విజ్ఞప్తి చేశారు. పార్టీలో ఎవరైనా సరే గీత దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. మా పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అయినా, ఎంపీ అయినా గీత దాటితే క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. క్రమశిక్షణ తప్పితే ఏం చేయాలో కమిటీ చూసుకుంటుందని ఆయన అన్నారు. రేపు కాంగ్రెస్ పార్టీ సమావేశం ఉందని, అందులో అన్ని అంశాలు మాట్లాడుతామన్నారు.

### ఊరూరా సంబురాలు చేయండి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో కుల గణన, ఎస్సీ వర్గీకరణ సంబురాలు చేయాలని పార్టీ నేతలను టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ ఆదేశించారు. నిన్న శాసనసభలో రెండు చరిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న బీసీ కుల గణన, ఎస్సీల వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయి. సమాజంలో రెండు ప్రధాన వర్గాలు బీసీలు, ఎస్సీలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కుల గణన, వర్గీకరణ కార్యక్రమాలు కార్యాచరణకు సిద్ధమయ్యాయయని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో బీసీలు, ఎస్సీలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి

- బీసీ కులగణన ఓ చరిత్ర
- బీసీలకు గత ప్రభుత్వం చేసిందేమీ లేదు
- అసెంబ్లీలో వారిని అవమానించింది
- కులగణన రాహుల్ ఆలోచన..
- మీడియాతో మంత్రి కొండా సురేఖ

అక్షరదర్బార్, హైదరాబాద్ : ఎన్నో ఏండ్లుగా అన్యాయానికి గురవుతున్న రాష్ట్రంలోని 56 శాతం బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని సంకల్పించిందని, బీసీ కుల గణనపై జరిగే కుట్రలను తిప్పి కొట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. బీసీలకు బీఆర్ఎస్ పార్టీ చేసిందేమీ లేదని, అసెంబ్లీలో, శాసన మండలిలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేసి బీసీలను అవమానించారని మండిపడ్డారు. కులగణన రాహుల్ గాంధీ ఆలోచన అని, దాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆచరణలో సాధ్యం చేసి చరిత్రను సృష్టించారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్యా, రాజకీయ, కుల సర్వే – 2024 ప్రకటన ఇటీవల ప్రవేశపెట్టిన సందర్భంగా పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకరయ్య, ఎమ్మెల్సీ ఎగ్గ మల్లేషంతో కలిసి కొండా సురేఖ విలేకరులతో మాట్లాడారు.

### అడ్డుకుంటే బీజీలకే నష్టం

కొన్ని దశాబ్దాలుగా రాష్ట్రంలో బీసీల సంఖ్య పెరుగుతున్నా, సామాజిక న్యాయం జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలను గత ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమస్యను తీర్చేందుకే తమ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో బీసీల కుల గణన చేపట్టినట్టు చెప్పారు. అఖిల భారత కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఆలోచనతో కుల గణన చేశామన్నారు. కుల గణనకి సంబంధించిన స్టేట్ మెంట్ మీదనే అసెంబ్లీ, శాసనమండలిలో తమ ప్రభుత్వం డిస్కసన్‌కు అనుమతి ఇచ్చినట్టు చెప్పారు.




మాట్లాడుతున్న మంత్రి సురేఖ

ఇంత కీలకమైన అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ చట్టసభ సభ్యులు సమావేశాల మధ్యలోనే వెళ్లిపోవడంతో సరికాదన్నారు. ఈ చర్య ద్వారా వారికి బీసీలపై ప్రేమ ఎంత ఉందో అర్థం అవుతుందని సురేఖ గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి బీసీల కోసం ఏమైనా చేశారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం బీసీల కోసం చేస్తున్న కృషిని పక్కదారి పట్టించేందుకు, బీఆర్ఎస్ తన సోషల్ మీడియా వేదికల ద్వారా కుల గణన పై నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

# కేటీఆర్ ని కలిసిన సత్యవతి, కవిత

అక్షర దర్బార్ మహబూబాబాద్ : శాసనమండలిలో బీఆర్ఎస్ విప్ గా మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ కు అవకాశం కల్పించిన సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ని ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మహబూబాబాద్ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.



# వేటు తప్పదా ?



- తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసులు
- వివరణ ఇవ్వాలన్న కాంగ్రెస్ క్రమ శిక్షణ కమిటీ
- నోటీసులపై ఘాటుగా స్పందించిన ఎమ్మెల్సీ..
- కాంగ్రెస్ పార్టీ మీ అయ్య జాగీరా? అంటూ హెచ్చరిక
- హస్తంపార్టీలో కలకలంరేపుతున్న మల్లన్న ఎపిసోడ్

అక్షరదర్బార్, హైదరాబాద్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు బిగ్ షాక్ తగిలింది. కాంగ్రెస్ క్రమ శిక్షణ కమిటీ బుధవారం పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. కుల గణన సర్వేను తప్పుబడుతూ అభ్యంతరకరమైన భాషతో విమర్శలు చేయడం, కుల గణన ఫారంను దహనం చేయడాన్ని తప్పుబట్టింది. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. మల్లన్న ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే ఆయనపై వేటు తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి. పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల బీసీ కులగణన, ఇతర సామాజిక వర్గాలపై మల్లన్న చేసిన కొన్ని వ్యాఖ్యలు పార్టీ నేతల ఆగ్రహానికి కారణమయ్యాయి. కాంగ్రెస్‌లోని ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని ఆయన చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. దీనిపై పార్టీలోని కొందరు సీనియర్ నేతలతోపాటు ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ పరువు దెబ్బతీసేలా మల్లన్న వ్యవహరించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని పలువురు హైకమాండ్‌ను పట్టుబట్టినట్లు తెలుస్తోంది. మొత్తానికి తీన్మార్ మల్లన్న భవిష్యత్ ఏ దిశగా మలుపు తిరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

## వివాదాలకు కేరాఫ్ !

కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వ్యవహార శైలిపై చర్చ సాగుతోంది. కాంగ్రెస్ టికెట్‌పై ఎమ్మెల్సీగా ఎన్నికైన మల్లన్న ఇటీవల కొంతకాలగా సొంతపార్టీ ముఖ్య నేతలపైనే నేరుగా విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా హన్మకొండలో నిర్వహించిన బీసీల రాజకీయ యుద్ధభేరి సభ పేరుతో హడావుడి చేశారు. తన ప్రసంగంలో కొన్ని వర్గాలను టార్గెట్ చేసి విమర్శించారు. రేవంత్ రెడ్డే తెలంగాణకు ఆఖరి ఓసీ సీఎం అని వ్యాఖ్యానించారు. అంతేగాక తనను తాను సీఎం క్యాండెట్‌గా ఎలివేట్ చేసుకునే ప్రయత్నం చేయడం మరింత వివాదాస్పదంగా మారింది. ఈక్రమంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యం ప్రతిష్టాత్మంగా చేపట్టిన కుల గణన నివేదికకు నిప్పుపెట్టడం.. తదితర కారణాల వల్లే తెలంగాణ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది.

## నోటీసులు ఇవ్వడానికి మీరెవరు ?

"నాకు నోటీసులు ఇవ్వడానికి మీరెవరు, కాంగ్రెస్ పార్టీ మీ అయ్య జాగీరా?" అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తనకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. మా పార్టీని వాడుకొని మీరు పెత్తనం చేస్తారా? ఈ దమ్కీలు, బెదిరింపులు చెల్లవు అన్నారు. ఇలా చేస్తే బీసీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోరని హెచ్చరించారు. బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని అన్నారు. కుల గణన నివేదికపై ఎమ్మెల్యేలు మాట్లాడకపోవడానికి వారి సమస్యలు వారికి ఉండవచ్చునని, వారిని ప్రజలే చూసుకుంటారని అన్నారు. కుల గణన పూర్తిగా తప్పుల తడకగా ఉందని చెప్పాల్సింది పోయి, పారదర్శకంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చెప్పడం దుర్మార్గమని ఆయన అన్నారు. "బీసీ ప్రజలారా, ఇది సమగ్ర కుల సర్వే కాదు. ఇది అగ్ర కుల సర్వే. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను కాపాడుకోవడానికి జానారెడ్డి ఆడిన నాటకమే ఈ సర్వే. దీనికి ఎలాంటి ప్రమాణాలు పాటించలేదు" అని విమర్శించారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవే బాధితులకు పరిహారం..

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- త్వరగా భూసేకరణ చేపట్టాలని అధికారులకు ఆదేశం




అక్షరదర్బర్, హనుమకొండ: పరకాల డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల మీదుగా వెళ్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే భూములకు సంబంధించి పలువురు రైతులకు పరిహారం అందిస్తామని, మిగిలిన రైతుల వద్ద నుండి డాక్యుమెంట్స్ సేకరించి వారికి త్వరగా పరిహారం అందేవిధంగా తహసీల్దార్లు చర్యలు చేపట్టాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పరకాల డివిజన్ పరిధిలో గ్రీన్ఫీల్డ్ హైవే కోసం సంబంధిత భూముల రైతులకు పరిహారం చెల్లింపు అంశంపై నేషనల్ హైవే, రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, పరకాల, దామెర, శాయంపేట, మండలాల్లో సంబంధిత రైతులకు ఇప్పటి వరకూ ఎంత మందికి ఇంకా పరిహారం చెల్లించాలనే వివరాలతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులను తహసీల్దార్లు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. భూములిచ్చిన రైతుల్లో పరిహారం అందని వారినుండి డాక్యుమెంట్స్ సేకరించి పరిహారం అందించి త్వరగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# ఫిబ్రవరి 4 చరిత్రాత్మక దినం

- దేశానికికే తెలంగాణ రోల్ మోడల్
- కాంగ్రెస్ తోనే సామాజిక న్యాయం సాధ్యం
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కుల గణన, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై సంబురాలు
- రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం


సీఎం ప్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

అక్షరదర్బార్, హన్మకొండ: ఫిబ్రవరి 4వ తేదీ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మర్చిపోలేని చరిత్రాత్మక రోజు అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండు కీలక సామాజిక ప్రక్రియలు నిన్నటి రోజు పూర్తవడంతో దేశంలో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆసెంబ్లీ వేదికగా బీసీ కుల గణనకు చట్టబద్ధత కల్పిస్తూ, ఎస్సీ వర్గీకరణకు మంత్రివర్గం ఆమోదం తెలియజేయండంపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ హాజరై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా నాయిని మాట్లాడుతూ..

## తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి

కొన్ని పార్టీల నాయకులు అభివృద్ధిని, సంక్షేమాన్ని ఆమోదించగాపోగా ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని కూడా స్వాగతించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. గతంలో సమగ్ర కుటుంబ సర్వే చేసి ఫలితాలను కేవలం తమ రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే వాడుకున్నారని మండిపడ్డారు. బీసీల సంఖ్య తగ్గిందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టడం వల్ల రాజకీయ ఉనికి దెబ్బ తింటుందని కొందరు మూర్ఖులు తమ అభద్రతభావాన్ని చెప్పలేక ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు ఉందని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేస్తుందని అన్నారు. గతంలో చాలా సంస్కరణలు తీసుకువచ్చిందని ఉపాధిహామీ పథకాన్ని అమలు చేసిందని, సమాచార హక్కు చట్టం తెచ్చిందని, రేషన్ కార్డులను అందించనుందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కాంగ్రెస్ సైనికులు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ మెంబెర్ ఈవీ శ్రీనివాస్ రావు, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, ఆర్టీఏ నెంబర్ పల్లకొండ సతీష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు పెరుమాండ్ల రామకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగుల నిర్మూలనకు కృషి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం


మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

అక్షరదర్బార్, వరంగల్: నులి పురుగుల నిర్మూలనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1810 పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ సెంటర్లలో ఒక సంవత్సరం పిల్లలు మొదలుకొని 19 సంవత్సరాల లోపు ఉన్న 1,81,807 పిల్లలందరికీ ఈ నెల 10వ తేదీన తప్పనిసరిగా ఆల్బెండ జోల్ మాత్రలు ఇవ్వాలన్నారు. అందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 10వ తేదీ మాత్రలు వేయని వారికి తిరిగి ఫిబ్రవరి 17న వేయాలని ఆదేశించారు. ఈ నెల 10న అనారోగ్యంతో ఉన్న పిల్లలను గుర్తించి, వారిని ఈ నెల 17తేదీన వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మాత్రలు వేయడం వల్ల పిల్లల్లో నులి పురుగుల సమస్య, రక్తహీనత, బుద్ధి మాంద్యం సమస్య ఉపశమనం కలిగి పిల్లల్లో చదువుల పట్ల ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. సిబ్బంది పర్యవేక్షణలోనే పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ ఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ వో డాక్టర్ సాంబశివరావు, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో ఘటన

అక్షరదర్బార్, జనగామ: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన జనగామ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి–నీర్మాల గ్రామాల మధ్య కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో సింగరాజుపల్లి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు తాళ్లపల్లి ఉదయ్ అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలు కాగా దవాఖానకు తరలించారు. ఎస్సై సృజన్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బోనస్ డబ్బులు అందించాలి

## మిల్లు ప్రధాన గేట్ ఎదుట హమాలీ కార్మికులకు నిరసన

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ పట్టణం లోని "గిల్డ మోడ్రన్ దాల్ ఆయిల్ మిల్" ప్రధాన గేటు దగ్గర ఏఐటీయూసీ అనుబంధ హమాలీ కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షులు అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ మిల్లు ఏర్పడిన నాటి నుండి హమాలీ కార్మికులకు ప్రతి దీపావళికి బోనస్ అందించే వారని అన్నారు. రెండేళ్లుగా బోనస్ అందించడం లేదని వాపోయారు. ఈ మేరకు అధికారులకు వినతి పత్రం ఇచ్చి ముందస్తుగా సమ్మె నోటీసు యజమానితో పాటు సంబంధిత అధికారులకు కూడా ఇచ్చినట్లు తెలిపారు. బోనస్ డబ్బులు ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించకపోవడంతో సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, సుంచు ముత్యాలు. చెక్కల సోమయ్య. కర్పూర రామ్మూర్తి. ఈసాల రామ్మూర్తి. వంకాయల నరసింహ.. పెసర దేవేందర్. పి నారాయణ, ఖాయం రమేష్,


నిరసన తెలుపుతున్న హమాలీ కార్మికులు

కాయం నరసింహ, పెరుగు కుమార్ వెలుగు శ్రావణ్. జలగం ప్రవీణ్, ఆబోతు అశోక్, చిలువేరు వికాస్ హర్షవర్ధన్ మేక వెంకటేష్ వేణు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం బోనస్ ఇవ్వాలి

- రైతులకు రుణమాఫీ చేసి న్యాయం చేయాలి
- తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు



అక్షర దర్బార్, పరకాల : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని చెప్పి రైతులకు న్యాయం చేస్తామని చెప్పి ఇప్పటివరకు వరి ధాన్యం కొనుగోలు చేసి రైతులకు పూర్తిగా రైతు బోనస్ ఇవ్వ పోవడం బాధాకరమని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరకేల కిషన్ రావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు రుణమాఫీ అని చెప్పి 31 వేల రైతు మాఫీ చేసేది ఉండగా కేవలం 21000 కోట్లు మాత్రమే చేసి చేతులు దులుపుకుంది అని విమర్శించారు. ప్రభుత్వం ఎలాంటి ఆకాంక్షలు లేకుండా వెంటనే మిగిలిన రైతులందరికీ రుణమాఫీ చేయాలని, రైతులందరికీ వారు చెప్పిన విధంగా రైతు భరోసా డబ్బులు పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

# చెరువులో మునిగి యువకుడు మృతి

- తాత అంత్యక్రియల్లో పాల్గొని మనవడు మృత్యువాత
- మైసంపల్లిలో విషాదం



అక్షర దర్బార్, నర్సంపేట : చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. దుగ్గొండి మండలం మైసంపల్లికి చెందిన పిట్టల మల్లయ్య అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. మంగళవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించగా, కుటుంబ సభ్యులు చెరువులో స్నానం చేస్తున్న క్రమంలో మల్లయ్య మనవడు పిట్టల రంజిత్ ప్రమాదవశాత్తు చెరువులో మునిగి గల్లంతయ్యాడు. వెంటనే స్థానికులు బయటికి తీసి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తాత, మనవడి మృతితో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

అక్షర దర్బార్, పరకాల : దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ కులాల చిరకాల వాంఛ అయిన వర్గీకరణ ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ చరిత్రలోనే మొదటి సీఎం అని కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కులగనన కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి, బీసీ జనాభా ప్రాతిపదికన బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతగా పరకాల పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోద రామకృష్ణ, పరకాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్, చిన్నాల గోనాథ్, మాజీ ఎంపీపీ ఉంటే రామ్మూర్తి, మెరుగు శ్రీశైలం, మడికొండ శ్రీను, మార్క రఘుపతి గౌడ్, పసుల రమేష్, నల్లెల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## నడికూడ మండలంలో..

నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం చేశారు.



# తండ్రి కొడుకును పొట్టన పెట్టుకున్న చలివాగు

- నాడు తండ్రి. నేడు కొడుకు
- చలివాగులో మునిగి మృతి
- పంగిడిపల్లిలో విషాదం



అక్షరదర్బార్, టేకుమట్ల: తండ్రి కొడుకుల పాలిట మృత్యువుగా మారి చలివాగు ఇద్దరిని పొట్టన పెట్టుకుంది. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లి గ్రామంలో జరిగింది. వివారాల్లోకి వెళ్లితే.. 2023 సెప్టెంబర్ 09న పంగిడిపల్లి గ్రామానాకి చెందిన పురాణం భవాని, అతని చిన్న కొడుకు సంతోష్ కలిసి ఆశిరెడ్డిపల్లి– పంగిడిపల్లి శివారు చలివాగులో చెక్ డ్యామ్ సమీపాన చేపలు పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో భవాని కుమారుడు సంతోష్ చలివాగులో పడి కొట్టుకుపోతుంటే, భవాని కాపాడేందుకు వాగులో దూకి తన కుమారుడిని కాపాడి వాగులో మునిగిపోయి మృతి చెందాడు. అప్పుడు ప్రాణలతో బయటపడిన సంతోష్ (మొగుళ్ళపల్లి హాస్టల్లో ఉంటు 9వతరగతి చదువుతున్నాడు) బుధవారం మొగుళ్లపల్లి– చిట్యాల మండలం నవాబుపేట గ్రామాల మద్యలోని చలివాగులో దిగి లోతు గమనించకుండా మునిగిపోయాడు. అతడితో వెళ్ళిన మరో ఫ్రెండ్ కేకలు వేస్తు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ నీటిలో మునిగిపోయాడు. చుట్టు పక్కల రైతులు వచ్చి మునిగిపోయిన సంతోష్ ని బయటికి తీసేసరికి అప్పటికే మృతి చెందాడు. ఏడాదిన్నర కాలంలో చలివాగులో ఇలా తండ్రి కొడుకులు మృతి చెందడం పట్ల అయ్యో పాపం అంటూ, మృతుల బంధువులు, గ్రామస్తులు కంటతడి పెట్టారు.


మాట్లాడుతున్న కవ్వా లక్ష్మారెడ్డి

# అమరుల స్మారక స్మృతి కేంద్రంగా ఏర్పాటు చేయాలి

అక్షరదర్బార్, భీమదేవరపల్లి: మండలంలోని ముల్కనూర్ లో గల తెలంగాణ అమరవీరుల స్థూపన్ని అమరుల స్మారక స్మృతి కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి అధికారులకు కవ్వా లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతి రహదారి విస్తరణలో భాగంగా తెలంగాణ స్థూపాన్ని తొలగించద్దని బుధవారం మండల తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ ని కలిసినట్లు వారు తెలిపారు. డా. బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని, అమరుల స్తూపం గల ప్రాంతాన్ని అన్ని వసతులతో జంక్షన్ ఏర్పాటు చేయాలని ఎమ్మార్వోకు సూచించినట్లు తెలిపారు. రోడ్డు విస్తరణలో స్థూపాన్ని తొలగిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో భాగంగా జేఏసీ దేగల సారయ్య, చేప్యాల ప్రకాష్, రెనుకుంట్ల బిక్షపతి, మాట్ల వెంకటస్వామి, కరుణాకర్, కడారి ప్రభాస్, సుధాకర్, ప్రభుదాస్, కుమార స్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒంటరిజీవితం భరించలేక వ్యక్తి ఆత్మహత్య



అక్షర దర్బార్,కాటారం : తోడు ఉండాల్సిన భార్య కొన్నేళ్ల క్రితం మరణించడంతో కుమిలిపోయాడు. తోడులేని జీవితం ఇక వ్యర్థమని భావించి జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ వివరాల ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి గ్రామానికి చెందిన బలిజె చంద్రయ్య(65) భార్య మరణించగా తోడులేని జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో మహదేవపూర్ మండలకేంద్రంలోని నర్సరీ శివారులో బుధవారం ఉదయం ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వెల్లడించారు.

# గుండెపోటుతో ఇంటర్ విద్యార్థిని మృతి



అక్షర దర్బార్ మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండల కేంద్రంలోని ఈఎంఆర్ ఎస్ పాఠశాలలో గుండె పోటుకు గురై విద్యార్థిని మరణించింది. వివరాల్లోకి వెళ్తే.. మరిపెడ మండలం తానంచర్ల గ్రామ పరిధి సభావత్ తండాకు చెందిన వీరు కూతురు రోజా సిరోలు ఈ ఎంఆర్ఎస్ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయగా, విద్యార్థిని రోజా డ్యాన్స్ వేస్తూ ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన ఉపాధ్యాయులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు.



మాట్లాడుతున్న స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం లభించింది
- అసమానతలను సరిచేసేందుకే వర్గీకరణ
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కావ్య
- అంబేద్కర్, రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం

# కల సాకారమైంది

అక్షరదర్బార్, స్టేషన్ ఘనపూర్ : మాదిగ, మాదిగ ఉప కులా కల సాకారమైందని, 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం లభించిందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. షెడ్యూల్ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంతోపాటు షెడ్యూల్ కులాలను ఏ.బీ.సీ కేటగిరీలుగా రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాదిగ, మాదిగ ఉపకులాల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కావ్య పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు అందించిన రాజ్యాంగఫలాలు, రిజర్వేషన్లు జనాభా దామాషా ప్రకారం అమలు కావాలని అన్ని వర్గాలకు అందాలని 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దండోరా ఉద్యమం జరిగిందని తెలిపారు. సుదీర్ఘ పోరాటానికి నిన్న ఫలితం లభించిందని, మాదిగ మాదిగ ఉపకులాల కల సాకారమైందని ఆనందం వ్యక్తం చేశారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ ఎవరికి వ్యతిరేకం కాదని, షెడ్యూల్ కులాల్లో ఉన్న అందరం కూడా అన్నదమ్ములమేనని స్పష్టం చేశారు. షెడ్యూల్ కులాలలో ఉన్న అసమానతులను సరిచేయడమే వర్గీకరణ ముఖ్య ఉద్దేశమని వివరించారు. సుప్రీంకోర్టు తీర్పును శిరసావహిస్తూ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు

అక్షర దర్బార్,కాటారం : ఎస్సీ వర్గీకరణను అమలుచేస్తామంటూ అసెంబ్లీ లో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేసిన నేపథ్యంలో కాటారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా కాటారం మండలకేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు టపాకులు కాల్చుతూ స్వీట్లు పంచుకున్నారు.దశాబ్దాల కలను దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందుగా అమలుచేస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డి అన్నారని ఎస్సీ వర్గీకరణను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో కాటారం మండల కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్ రెడ్డి ,ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ గద్దల రమేశ్,నాయకులు మంత్రి విజయరాజు, జాడి మహేశ్వరి,నాయిని శ్రీనివాస్,చీమల రాజు,కడారి విక్రమ్,నీలాల సమ్మయ్య,నీలాల రాజు,గద్దల మహేష్,రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గొండి మండల అభివృద్ధికి రూ.2.53.కోట్ల నిధులు



అక్షర దర్బార్, దుగ్గొండి : దుగ్గొండి మండలంలోని పలు గ్రామా ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.53 కోట్ల నిధులను మంజూరు చేసింది. కాగా, దుగ్గొండి మండల అభివృద్ధికి సహకరిస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా మండలాన్ని అగ్రబాగాన నిలిపేందుకు ఎమ్మెల్యే సహకారంతో మరింత ముందుకు వెళ్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో దుగ్గొండి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రల్ల బాబు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నూరు కిరణ్ రెడ్డి వలిగి నరసింహారావు మండల యూత్ అధ్యక్షుడు కొత్తకొండ రవి వర్మ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామారావు, నాయకులు మట్టరాజు చుక్క రమేష్ డ్యాగం శివాజీ బండారి ప్రకాష్ నాగరాజు నరేందర్ తదితరులు పాల్గొన్నారు

# లారీ ఢీకొని వ్యక్తి మృతి

## రెడ్డిపాలెం జంక్షన్ వద్ద ఘటన

అక్షరదర్బార్, వరంగల్: లారీ ఢీకొని బైక్ పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెం జంక్షన్ వద్ద ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గొర్రెకుంట నుండి కొత్తపేట వైపు వెళ్తున్న లారీ ముస్త్యాలపల్లి నుండి కాశీబుగ్గ వైపు వెళ్తున్న మోటార్ సైకిల్‌ని ఢీకొట్టింది. దీంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన సిద్దోజు సదానందం (55) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య సిద్దోజు రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ ఏ. రాఘవేందర్ తెలిపారు.

# ఆ క్వారీల్లో అంతా ఓపెన్ సీక్రెట్!

- అడ్డగోలుగా ఇసుకను నింపి పంపిస్తున్న వైనం
- తగ్గేదే లే అంటున్న ఇసుక కాంట్రాక్టర్లు
- అండదండలున్నాయంటూ బుకాయింపు
- అభయహస్తమిస్తున్న టీజీఎండీసీ సిబ్బంది




అక్షర దర్బార్,కాటారం: జయశంకర్ భూపాలపల్లి మహదేవపూర్ మండలంలో ఏర్పాటైన పల్గుల –6,మద్దులపల్లి,పూసుకుపల్లి తదితర క్వారీలో ఓపెన్ సీక్రెట్ గా ఇసుక దందా నడుస్తోంది.ఆ కాంట్రాక్టర్లు క్వారీల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ బాజాప్తా బరితెగిస్తున్నారు .ఓవర్ లోడ్ తతంగాన్ని తమ క్వారీలకు చిరునామాగా మార్చుకుని యథేచ్ఛ దందా సాగిస్తున్నారు .ఓ కాంట్రాక్టర్ అయితే ఏకంగా కాళేశ్వరంలోని ప్రధాన రహదారికి ఆనుకునే డంపులు ఏర్పాటుచేసుకుని ఇసుక దందా వ్యవహారం నడిపిస్తుండగా ఇక్కడంతా అందరికీ మామూళ్లేనంటూ అక్కడి ప్రజలు కోడైకూస్తున్నారు.ఇంతలా ఆ కాంట్రాక్టర్లు బహిరంగంగానే ఎక్స్ట్రా బకెట్,ఓవర్ లోడ్ ఛార్జ్ ల పేరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతుండగా పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు ఆమ్యామ్యాల మమతానురాగంలో తూగుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.కాగా ఆయా క్వారీల్లో విధి విధానమంటూ లేకపోగా ఎవరికిష్టమొచ్చినట్లు వారు ఇసుకను తరలిస్తూ క్యాష్ చేసుకుంటున్నారు.

## తగ్గేదేలే అంటున్న ఆ కాంట్రాక్టర్లు

ప్రభుత్వ టెండర్ ద్వారా ఇసుక రీచ్ను దక్కించుకున్న సదరు ఇసుక కాంట్రాక్టర్లు తగ్గేదేలే అంటూ అడ్డగోలుగా ఇసుకను నింపి తరలిస్తున్నట్లుగా సమాచారం.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుకను పాసింగ్ తో లోడ్ చేయాల్సింది ఉండగా అవన్నీ మన దగ్గర నడవదని ఎక్స్ట్రా బకెట్ల దందాకు తెరలేపి లక్షల్లో సంపాదించుకుంటున్నట్లుగా విమర్శలు వినిపిస్తున్నాయి.టైం లిమిట్ అనే తేడా లేకుండా వారికిష్టమొచ్చినట్లుగా ఇసుకను నింపుతూ జేబులు నింపుకుంటున్నట్లుగా బహిరంగంగా చర్చలు జరుగుతున్నాయి.ఇదేంటని ఎవరైనా ప్రశ్నించారో ఇక అంతే సంగతులని మాకు మినిష్టర్లు తెలుసని ఏం చేసుకుంటారో చేసుకోండంటూ సదరు కాంట్రాక్టర్లు బెదిరింపులకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.రాష్ట్ర మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ,,టీజీఎండీసీ ఎండీ,కలెక్టర్ స్థాయి అధికారులు తనిఖీలు చేపట్టి పట్టుమని మూడు రోజులు కూడా గడవక ముందే బాజాప్తా ఎక్స్ ట్రా బకెట్ వ్యవస్థను అమలుపర్చుతూ ఓపెన్ ఛాలెంజ్ విసురుతున్నారు.ఈ నేపథ్యంలోనే ఆయా సదరు కాంట్రాక్టర్లు బుధవారం సాయంత్రం ఇసుక డంపు ముందు దర్జాగా చైర్ వేసుకుని కూర్చొని తమ క్వారీల్లో ఎక్స్ ట్రా బకెట్ల వ్యవహారాన్ని నడిపించుకోవడం విశేషం.

## అభయహస్తమిస్తున్న టీజీఎండీసీ సిబ్బంది

ఆయా ఇసుక క్వారీల్లో టీజీఎండీసీ తరపున విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది క్వారీ కాంట్రాక్టర్ల కు అభయహస్తమిస్తున్నట్లుగా తెలుస్తోంది.సదరు సిబ్బంది క్వారీలోకి ఎవరైనా ప్రశ్నించే వ్యవస్థ వెళ్ళినట్లయిత్ వెంటనే కాంట్రాక్టర్ల తో మాట్లాడి సెటిల్ చేస్తున్నట్లుగా ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.ఇందుకు గానూ వారికి ఆయా కాంట్రాక్టర్లు రోజుకి వేలల్లో ఇస్తుండగా జీ హుజూర్ అంటూ కాంట్రాక్టర్ల ధనబలానికి మోకరిల్లుతున్నట్లుగా సమాచారం. ఇలా క్వారీలో పనిచేసే ప్రైవేట్ సూపర్వైజర్ లా సదరు టీజీఎండీసీ ఉద్యోగులు వ్యవహరిస్తున్న తీరు పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తుండగా పీవో ఎలాంటి చర్యలు తీసుకుంటాడో వేచిచూడాల్సిన అవసరం ఎంతైన ఉందంటూ పలువురు చర్చించుకుంటున్నారు.